www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 1 సెప్టెంబరు 2024 5 కాకినాడ



నగర పాలక సంస్థలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి - కాకినాడ

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నగర పాలక సంస్థలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ భావన తెలిపారు. రానున్న మూడు రోజుల భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో శనివారం నగరపాలక సంస్థకు చెందిన వివిధ విభాగాల అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లో ముంపునీటి సమస్య లేకుండా చేయాలని ఆదేశించారు. రోడ్లపై ఎక్కడా వర్షపు నీరు నిలిచిపోకుండా చూడాలని, వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంకి లేకుండా డ్రెయిన్లను శుభ్రపరచాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఎదురైతే తెలియచేసేందుకు ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1800 4255998కు సమాచారం అందించాలని తెలిపారు.

విస్తారంగా వర్షాలు

- స్తంభించిన జన జీవనం
- పాఠశాలలకు సెలవు ప్రకటించిన కలెక్టర్
- కలక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు


కాకినాడలో కురిసిన వర్షంతో రోడ్డుపై నిలిచిపోయిన నీరు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా జిల్లాలో గత రెండు రోజులుగా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించిన ఈ నేపథ్యంలో మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం కనిపిస్తోంది. పలు చోట్ల పిడుగులు, ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ ప్రకటించింది. అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ షాన్‌మోహన్ ప్రకటించారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ప్రజలు వణికిపోతున్నారు. శుక్ర, శనివారాల్లో జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలతో జనజీవనం స్తంభించింది. కాకినాడ నగరంలోని పలు ప్రాంతాలు మరోసారి పూర్తిగా నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అవ్వడంతో జనజీవన కార్యకలాపాలకు ఆటంకం ఏర్పడింది. ప్రధానంగా మెయిన్ రోడ్డు, సాంబమూర్తి నగర్, ఆర్‌టిసి కాంప్లెక్స్, పాత బస్టాండ్ సెంటర్లలో మోకాలు లోతు నీరు నిలిచిపోవడంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. భారీ వర్షాలు కురిసినప్పుడల్లా కాకినాడ నగరం వారం నుంచి పది రోజులపాటు ముంపులోనే ఉంటుంది. స్మార్ట్ సిటీ నిధులు రూ. వేల కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేసినప్పటికీ ముంపు సమస్య తీరడం లేదని నగర ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. అలాగే పిఠాపురం, తుని,పెద్దాపురం, సామర్లకోట కూడా పట్టణాల్లో డ్రెయినేజీలు పొంగిపొర్లుతున్నాయి. అన్ని మండలాల్లోనూ లోతట్టు ప్రాంతాల జలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆకాశమంతా ముసురు ముసుగేయడంతో ఎవరూ బయటకు అడుగు వేయలేని పరిస్థితి ఏర్పడింది. రోజూ వారి పనులు చేసుకుంటున్న చిరు వ్యాపారులు, డైలీ లేబర్ కార్మికులు, వ్యవసాయ కార్మికుల ఉపాధికి గండి పడింది. తోపుడు బళ్ళు, సైకిళ్లపై వ్యాపారాలు సాగించే వారంతా ఇళ్లకే పరిమితం అయ్యారు. పలు ప్రభుత్వ పాఠశాలల ఆవరణలు వర్షం నీటితో నిండిపోయాయి.

ముసురుతో పొంచివున్న ముప్పు

శనివారం జిల్లా సరాసరి 56.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. అత్యధికంగా శంఖవరం మండలంలో 84, తొండంగి మండలంలో 82, పిఠాపురం మండలంలో 75.2, ఏలేశ్వరం మండలంలో 67, తుని మండలంలో 65, రౌతులపూడిలో 64, గండేపల్లిలో 63, యు.కొత్తపల్లిలో 59.6, కాకినాడ అర్బన్‌లో 55.4, కాకినాడ రూరల్ లో 54.2, కిర్లంపూడిలో 53.2, కోటనందూరులో 52.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. ఈ నేపథ్యంలో జిల్లా అంతా ముసురు కమ్మేసింది. ఆకాశమంతా మేఘావృతమవ్వడంతో జిల్లా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో పలువురు విష జ్వరాలు, డెంగూ, మలేరియా వంటి రోగాలతో సతమతం మవుతున్నారు. వేలమంది రోగులు ఆసుపత్రుల చుట్టూ వైద్యం కోసం తిరుగుతున్నారు. ఇదే తరుణంలో రెండు రోజులుగా ముసుగేసిన ముసురు కారణంగా వ్యాధులు మరింతగా విజృంభించే అవకాశం కనిపిస్తోంది. దీంతో ప్రజలకు రోగాల భయం పట్టుకుంది. ఇప్పటికే జిల్లాలో ఉన్న పలు పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది. దీంతో ఆయా గ్రామాల్లో సమస్యలు నెలకున్నాయి. అధికారులు సరైన చర్యలు చేపట్టి పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలనే డిమాండ్ వ్యక్తం అవుతోంది.

స్కూళ్లకు సెలవు

జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ స్కూళ్లకు సెలవు ప్రకటిస్తూ కలెక్టర్ షాన్‌మోహన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జరగాల్సిన పరీక్షలు సెప్టెంబర్ 6న నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. శనివారం సెలవును మరొక రోజు స్కూలు నిర్వహించడం జరుగుతుందని ఆ ఉత్తర్వుల్లో వివరించారు. రానున్న మూడు రోజులపాటు రాష్ట్రంలో, జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో జిల్లా అధికారులు, మండల తహశీల్దార్‌లు అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులంతా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అవసరమైన సహాయక చర్యలకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. కూలిపోయే భవనాలకు ప్రజలు దూరంగా ఉండాలన్నారు.

కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

కాకినాడ కలెక్టరేట్లో 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. వర్షాలు కారణంగా ఎవైనా సమస్య తలెత్తితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ -1800 4253077 సమాచారం అందించాలని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఇందుకు 24 గంటలు సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు.

పొలాల్లోకి చేరుతున్న వరద నీరు

వర్షాలు కురుస్తున్న తరుణంలో వరద నీరు భారీగా పొలాల్లోకి వచ్చి చేరుతుంది. జిల్లావ్యాప్తంగా కుండపోత వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సుమారు నెలరోజుల క్రితమే నాట్లు పూర్తవ్వగా ఇప్పుడు ఎడ ఎడతరుపు లేకుండా కురుస్తున్న వర్షాలతో నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 4,737 ఎకరాల్లో పంటలు నీట మునిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

అప్రమత్తమైన విద్యుత్తు శాఖ

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యుత్ శాఖ అప్రమత్తమయింది. రాజమహేంద్రవరం సర్కిల్‌తోపాటు రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ డివిజన్, కాకినాడ, పెద్దాపురం, జగ్గంపేట, అమలాపురం, రామచంద్రాపురం, రంపచోడవరం డివిజన్లలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు రాజమహేంద్రవరం ఆపరేషన్ సర్కిల్ ఎపిఇపిడిసిఎల్ ఎస్‌ఇ కె.తిలక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తెగిపడిన విద్యుత్తు వైర్లను గాని, విద్యుత్ స్తంభాలను గాని, విద్యుత్ వైర్లపై పడిన చెట్లు కొమ్మలను గాని, తడిసిన విద్యుత్ పరికరాలను గాని నేరుగా తాకవద్దని ఆయన ఈ సందర్భంగా సూచించారు.


జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఆశా వర్కర్ల యూనియన్ ప్రతినిధులు

3న జరిగే ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కాకినాడ

ఫిబ్రవరి 9న ప్రభుత్వంతో జరిగిన చర్చలకు సంబంధించిన అంశాలపై తక్షణమే జిఒను విడుదల చేయాలని సెప్టెంబర్ 3న జరిగే ధర్నాను ఆశా వర్కర్లు జయప్రదం చేయాలని యూనియన్ నాయకత్వం పిలుపునిచ్చింది. శనివారం ఆశా వర్కర్ల యూనియన్ నాయకత్వం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరసింహనాయక్‌కి వినతిపత్రం అందించింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ మాట్లాడుతూ 2024 ఫిబ్రవరి 8వ తేదీన ఆశా వర్కర్స్ చలో విజయవాడ నిర్వహించి డి వార్మింగ్ డేను బాయ్ కట్ చేయడంతో ప్రభుత్వ అధికారులు ఆశా వర్కర్స్ రాష్ట్ర నాయకత్వంతో చర్చలు జరిపిందన్నారు. కొన్ని అంశాలకు మినిట్స్ కాపీలు ఇవ్వడం జరిగిందన్నారు. కానీ వాటికి ఇంతవరకు జిఒలు ఇవ్వకపోవడం చాలా దారుణమన్నారు. ఉద్యోగులందర్నీ వయోపరిమితి 62 సంవత్సరాలకి చేస్తే ఆశా వర్కర్స్‌ను 60 సంవత్సరాలకే ఏ విధమైన బెనిఫిట్స్ లేకుండా రిటైర్మెంట్ చేయడం తగదన్నారు. ప్రాణాలను పణంగా పెట్టి కరోనా సమయంలోనూ, విషజ్వరాలు వ్యాపించిన సమయంలో ఆశా వర్కర్లు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి విధులు నిర్వర్తిస్తున్నారని అన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ చూసే ఆశ వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని తదితర డిమాండ్లలో అధికారులు ఇచ్చిన కొన్నింటికి జిఒలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు ఇవ్వాలని, రికార్డులను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. ప్రసూతి సెలవులు, మెడికల్ లీవ్‌లు, ప్రభుత్వ సెలవులు వీటన్నింటికీ జిఒలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 3న ఆషాడేలో భోజన విరామ సమయంలో ధర్నా చేయాలని రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చిందని, ఈ ధర్నాను జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అంకాడి పద్మావతి, ఎస్.లక్ష్మి, సోనీ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - పెద్దాపురం


మొక్కను నాటుతున్న ఎంఎల్ఎ చినరాజప్ప

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, అందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పిలుపునిచ్చారు. శనివారం జగ్గంపేట రహదారిలో వనం మనం కార్యక్రమంలో ఆయన పాల్గొని రోడ్డు డివైడర్ల మధ్య, రహదారికి ఇరువైపుల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ద్వారానే ప్రజారోగ్యం బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల బాబు, తూతిక రాజు, మహమ్మద్ ఆరిఫ్ అలీ, యాళ్ల వీరబాబు, కొల్లి దుర్గాప్రసాద్, గోకేడ భార్గవ్, అనివిల్ల శాస్త్రి, ఒబిలిసెట్టి గణేష్ పాల్గొన్నారు.

నిర్వహించిన విధులే జ్ఞాపకాలు

ప్రజాశక్తి - కాకినాడ, గండేపల్లి, అన్నవరం


స్వరాజ్యకుమారిని సత్కరిస్తున్న సమాచార శాఖ డిడి

ఉద్యోగిగా నిర్వర్తించిన విధులే జీవితంలో మధుర జ్ఞాపకాలుగా మిగిలిపోతాయని సమాచార శాఖ డిడి డి.నాగార్జున అన్నారు. శనివారం కాకినాడ సమాచార శాఖ డిడి కార్యాలయ టైపిస్ట్ జి.స్వరాజ్యకుమారి పదవీ విరమణ అభినందన సభ హౌస్ ఆఫ్ ప్రేయర్ హాలులో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వరాజ్య కుమారి ప్రతీ విషయాన్ని ఎంతో శ్రద్ధగా ఓపిగ్గా విని తన బాధ్యతలను సకాలంలో నిర్వహించేవారన్నారు. స్వరాజ్య కుమారిని సమాచార శాఖ సిబ్బంది, బంధువులు పూల మాలలు వేసి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పిఆర్ఒ పెద్దింటి రవి, సిబ్బంది సిహెచ్ బాబూరావు, పద్మజ, బషీర్, గోపి, లక్ష్మి, నరేష్, అజయ్, సతీష్, సూర్యనారాయణ పాల్గొన్నారు. అలాగే గండేపల్లి మండల ఇఒపిఆర్‌డి వెంపరాల సత్యనారాయణమూర్తి పదవీ విరమణ సభ స్థానిక పరిణయ ఫంక్షన్ హాల్ జరిగింది. ఎంపిడిఒ వెంకట్ రామన్ అధ్యక్షతన జరిగిన సభలో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మూర్తి, ఆయన సతీమణి కామేశ్వరిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిపిఒ కె.భారతిసౌజన్య, ఎంపిపి దొరబాబు, పి.బాబు, కె.చిట్టిబాబు పాల్గొన్నారు. అలాగే అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం ఉద్యోగి పాసర్లపూడి స్వామీజీ పదవీ విరమణ వీడ్కోలు సభ జరిగింది. ఈ సభలో దేవస్థానం ఛైర్మన్ ఐవి.రోహిత్, ఇఒ కె.రామచంద్రమోహన్ పాల్గొన్నారు. స్వామీజీ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దేవస్థానం ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, అర్చకులు, వ్రత పురోహితులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై అట్టుడికిన కౌన్సిల్

ప్రజాశక్తి - సామర్లకోట


సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్

సామర్లకోట మున్సిపల్ సమావేశం సమస్యలపై అట్టుడికింది. పసరు రంగుతో కూడిన తాగునీటిని సరఫరా చేయడంపై కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. అధికారుల నిర్లక్ష్యంపై సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ప్రజా సమస్యలపై చర్చించాలం టూ 30వ వార్డు కౌన్సిలర్ చల్లపల్లి సత్యనారాయణ ఛైర్‌పర్సన్‌ను కోరారు. జీరో అవర్ రెండు గంటలపైబడి కొనసాగింది. పారిశుధ్య విధుల్లో వాహనాలకు వినియోగించే డీజిల్ విషయంలో భారీ స్థాయిలో కుంభకోణం ఉందని, దీనిపై ఫిర్యాదులు చేసిన ఎందుకు పట్టించుకోవడం లేదని కౌన్సిలర్ చల్లపల్లి సత్యనారాయణ నిలదీశారు. మున్సిపాలిటీలో రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్ట్‌ల నిర్మాణాలకు నిధులు మంజూరు అయినా పనులు ఎందుకు చేపట్టడం లేదని అవాల లక్ష్మి నారాయణ, నేతల హరిబాబు, జట్లా మోహన్, కాళ్ళ శ్యామల అధికారులను ప్రశ్నించారు. ప్రతిరోజు కుళాయిల్లో బురదనీరు, ఆకు పసరు నీరు వస్తున్నా ఎవరూ పట్టించుకోవడం కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ, పితాని కృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఛైర్‌పర్సన్ అరుణ మాట్లాడుతూ కౌన్సిల్ సభ్యులు చెప్పిన అన్ని సమస్యలపై మున్సిపాలిటీలోని అన్ని శాఖల అధికారులతో త్వరలోనే ఒక సమావేశం ఏర్పాటు చెయ్యాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ వుబా జాన్‌మోజేష్, డిఇ అనంతలక్ష్మి, పాల్గొన్నారు.

ముగిసిన మెగా బూట్ క్యాంప్

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో రెండు రోజులపాటు నిర్వహించిన మెగా బూట్ క్యాంపు విజ్ఞానదాయకంగా ముగిసింది. హైదరాబాద్‌కు చెందిన ఆర్ టెక్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ క్యాంపులో ఎక్స్‌పీరియెన్స్ ఎంబెడెడ్ ఇంజినీర్లు కె.ఆదిత్య, జి.జనార్ధనరెడ్డి, డాక్టర్ ఎస్ఎల్. శ్రవణ్‌కుమార్ పాల్గొని శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రెండు రోజుల బూట్ క్యాంప్ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులు వివిధ డొమైన్‌ల మీద శిక్షణ పొందుటకు, సాంకేతిక నైపుణ్యాన్ని మెరుగుపర్చుకునేందుకు అవకాశం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ అకడమిక్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ సంజీవ్‌కుమార్, ఆర్ టెక్ కోఆర్డినేటర్ టి.రవీంద్ర పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ట్రైనీ కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని ఎ.మల్లవరం గురుకుల పాఠశాలను ట్రైన్ కలెక్టర్ భావన శనివారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. పాఠశాలలోని మంచినీటి కేంద్రాలను, వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశీలించారు. పాఠశాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి విద్యార్థులతో సమావేశమయ్యారు.

నాటక దర్శకుడు వెంకయ్యనాయుడుకి నివాళి

ప్రజాశక్తి - తాళ్లరేవు

సాంఘిక నాటకాల దర్శకుడు రోళ్ళ వెంకయ్య నాయుడు సంస్మరణ సభ శనివారం జరిగింది. ఆయన కుమారులు రోళ్ళ చక్రవర్తి, నానిలను పలువురు పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు చిత్రపటానికి మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, కళాకారులు వాకపల్లి చిరంజీవి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అత్తిలి బాబురావు, ధూళిపూడి బాబి, దాసరి వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఆలయ స్థలాన్ని కాపాడండి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని నాగులపల్లి గొల్లపేట సెంటర్లో ఉన్న దుర్గమ్మ ఆలయ స్థలాన్ని కబ్జా నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు. స్థానికంగా జరిగిన సమావేశంలో గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ ఆలయానికి సంబంధించిన స్థలాన్ని గత తహశీల్దార్ సర్వే చేసి, ఆలయానికి సంబంధించినదిగా గుర్తించారని అన్నారు. చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తక్షణమే అధికారులు స్పందించకుంటే ఆందోళనకు సిద్ధపడతామని గ్రామస్తులు హెచ్చరించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - కోటనందూరు


తాండవ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

తాండవ రిజర్వాయర్ పరివాహక ప్రాంతాలైన అల్లిపూడి, కాకరాపల్లి, కోటనందూరు, బొద్దవరం, తుని, డి.పోలవరం ప్రాంత ప్రజల అప్రమత్తంగా ఉండాలని డిఇ పి.అనురాధ సూచించారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కొండ ప్రాంతాల నుంచి వర్షపునీరు పెద్దఎత్తున రిజర్వాయర్‌లోకి చేరుతుందన్నారు. తాండవ నీటి నిల్వ సామర్థ్యం 380 అడుగులు కాగా ప్రస్తుతం నీటి నిల్వ 377.07 అడుగులకు చేరిందన్నారు. మరో రెండు అడుగులకు నీరు చేరితో తాండవ గేట్లు ఎత్తివేయాల్సివుంటుందన్నారు. తాండవ రిజర్వాయర్ ప్రాంతాన్ని నర్సీపట్నం ఆర్‌డిఒ, తాండవ రిజర్వాయర్ అధికారులు పరిశీలించారు.

పారిశుధ్య కార్మికునికి సాయం

ప్రజాశక్తి - కరప


కరప పంచాయతీ పారిశుధ్య కార్మికుడు మేడిశెట్టి మల్లిశ్వరరావుకు మానవత్వం స్వచ్ఛంద సేవా సంస్థ నిత్యవసర సరుకులు అందజేసింది. పది రోజుల క్రితం ఆరోగ్యం క్షీణించడంతో ఆ కార్మికుడు ఆసుపత్రిలో చికిత్స అందించారు. నెల రోజులపాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఆ కార్మికుడి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు సూచనతో మానవత్వం స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ జొన్నలగడ్డ రాజు బియ్యంతోపాటు, నిత్యవసర సరుకులు, కొంత ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ జొన్నలగడ్డ రాజు, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, పేపకాయల తనుకుల రాజు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - కాజులూరు

నేడు తమ పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వినాయక పాఠశాల కరస్పాండెంట్ టి.కిషోర్ కోరారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు తమ పాఠశాల ఆవరణలో వేమగిరి పరమహంస కంటి ఆసుపత్రి వైద్యులచే కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. కాజులూరు పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవసరమన వారికి మందులను ఉచితంగా అందిస్తామని, ఆపరేషన్ చేయల్సిన వారికి ఉచితంగా చేయించడం జరుగుతుందన్నారు.

కార్టూ'నిజం'



అంబానీని దాటేసిన అదానీ

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ రాజశేఖర్

పట్టణ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కౌన్సిలర్లు విజ్ఞప్తి చేశారు. శనివారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కరరావు, విజ్జపు రాజశేఖర్, ఆకుల కృష్ణ బాపూజీ, తదితరులు పలు సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. సంత మార్కెట్‌ను కుమ్మర వీధికి మార్చిన తర్వాత నుంచి అక్కడ సదుపాయాలు కల్పించలేదని, దీంతో కొనుగోలు దారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్లు, డ్రెయిన్లు వంటి పనులు పూర్తయిన తర్వాత నెలల తరబడి అక్కడ నుంచి వేస్ట్ మెటీరియల్ తొలగించక పోవటంతో ప్రజలు ఎన్నో అవస్థలు పడుతున్నా రన్నారు. ఆంజనేయస్వామి గుడిసెంటరు లో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నూతన భవనం నిర్మించకపోవడంతో మున్సిపాలిటీ ఆదాయాన్ని కోల్పోతుందన్నారు. పెద్ద రహదారులకు, కల్వర్టులకు ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి చేయడం మంచిదేనని, అయితే చిన్న చిన్న వీధుల్లో రోడ్లు, డ్రెయిన్లు నిర్మించకపోవడంతో ఆ ప్రాంతాల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. టిడ్కో కాలనీలో ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. సూరంపాలెం రహదారి లే అవుట్‌లో పట్టాదారులకు ఇల్లు కట్టిస్తామని ఒక్కొక్కరి నుంచి రూ.35 వేలు కట్టించుకున్నారని, కానీ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించడం లేదని, వెంటనే లబ్ధిదారులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్లు నెక్కంటి సాయిప్రసాద్, కనకాల మహాలక్ష్మి, కమిషనర్ కెవి.పద్మావతి, మేనేజర్ జ్యోతిరాణి, డిఇఇ ఆదినారాయణరావు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - యంత్రాంగం

గండేపల్లి మండలంలోని మల్లేపల్లి గ్రామంలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. తొలుతగా సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోతుల మోహనరావు, పరిమి బాబు, కందుల చిట్టిబాబు, దోమ్మా శ్రీను, దిడ్డి శ్రీను పాల్గొన్నారు. **పెద్దాపురం** పెద్దాపురం కొత్తపేటలో లబ్ధిదారులకు ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పింఛన్ సొమ్మును అందచేశారు. ఈ కార్యక్రంమలో మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల బాబు పాల్గొన్నారు. **కాజులూరు** మండలంలో 92.19 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఎంపిడిఒ సి.నాగేశ్వరశర్మ తెలిపారు. **రౌతులపూడి** మండలంలోని శృంగవరం, ములగపూడి గ్రామాల్లో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్ సొమ్ములను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తమరాన సత్యనారాయణ, ఎంపిపి గంటిమల రాజ్యలక్ష్మి, పైల సాంబశివరావు, అల్లు నూకరాజు పాల్గొన్నారు. **కరప** మండలంలో 92 శాతం పింఛన్ల పంపిణీ చేయడం జరిగిందని ఎంపిడిఒ కె.అప్పారావు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, మాజీ జడ్‌పిటిసి నూరుకుర్తి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. **పెదపూడి** మండలంలో శనివారం సాయంత్రానికి 93.91 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపిడిఒ సత్య నారాయణరెడ్డి తెలిపారు. 18 గ్రామాలకు సంబంధించి 10,528 పింఛన్లకు గాను 9,887 మందికి అందజేశామన్నారు. **అన్నవరం** తొండంగి మండలంలో పెరుమాళ్ళపురం పంచాయితీ కొత్తచోడి, పిల్లిపేట, బుచ్చియ్యపేట గ్రామాల్లో ఎంఎల్ఎ యనమల దివ్య పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు పింపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతమనీడి అబ్బాయి, మోత్కూరి వెంకటేష్, కోయ్యా శ్రీనుబాబు పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండలంలో 94 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ ఎం.అనుపమ తెలిపారు. మండలవ్యాప్తంగా 11,548 పింఛన్లకు గాను 10,845 పింఛన్లు పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు.


గండేపల్లిలో పింఛన్లు అందిస్తున్న ఎంఎల్ఎ నెహ్రూ


అన్నవరంలో పింఛన్ అందిస్తున్న ఎంఎల్ఎ దివ్య


పెద్దాపురంలో పింఛన్ అందిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

నేరాలు ఘోరాలు

మద్యం మత్తులో ప్రయాణికులపై దాడి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పిల్లంక పంచాయతీ గోపులంక కొత్త కొంపలు ప్రాంతంలో ముగ్గురు యువకులు శనివారం మద్యం మత్తులో ప్రయాణికులపై దాడి చేసి గాయపరిచారని కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. గోపులంక డీలర్ మండ రామసుబ్రహ్మణ్యం మహేశ్వరరావు గ్రామం నుంచి యానాం వెళ్తుండగా కొత్త కొంపలు వద్ద దారికి అడ్డుగా ఉన్న యువకులను పక్కకు తప్పుకోమన్నారు. అయితే మద్యం మత్తులో ఉన్న యువకులు మహేశ్వరరావుపై దాడి చేశారు. అదే సమయంలో యానాం సినిమాకు వెళ్తున్న మహేశ్వరరావు, ఆయన కుమారులు సంతోష్, కృష్ణ వారిని వారించడానికి ప్రయత్నించారు. దీంతో వారిపై బీరు సీసా పగలగొట్టి దాడి చేశారు. అదే సమయంలో రహదారిపై వెళ్తున్న మరో ప్రయాణికుడు పితాని శ్రీరాములు తల పైన బీరు బాటిల్‌తో కొట్టడంతో అతనికి తలపై తీవ్ర గాయం అయింది. మరో నలుగురు ప్రయాణికులపైన మద్యం మత్తులో ఉన్న యువకులు దాడి చేశారు. ఈ దాడిలో తన రెండు బంగారు గొలుసులను మద్యం సేవించిన యువకులు లాక్కున్నారని మహేశ్వరరావు విలేకరులకు తెలిపారు. ఒక బంగారు గొలుసు యువకుల జేబు నుంచి స్థానికులు గుర్తించి ఇచ్చారని, ఇంకొక బంగారు గొలుసు దొరకలేదన్నారు. తన మొబైల్ ఫోను నేలకేసి కొట్టడం వల్ల పగిలిపోయిందని మహేశ్వరావు అన్నారు. దాడికి పాల్పడిన యానాం జిఎంసి బాలయోగి నగర్‌కు చెందిన యువకులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వీరిలో ఇద్దరు మైనర్లని తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురికి జరిమానా

ప్రజాశక్తి - సామర్లకోట

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురికి న్యాయమూర్తి జరిమానా విధించినట్లు ఎస్ఐ పివిఎన్.మూర్తి తెలిపారు. శుక్రవారం రాత్రి నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ముగ్గురు వ్యక్తులను కాకినాడ జిల్లా కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ తెలిపారు. వీరిలో ఇద్దరికి రూ.10 వేలు చొప్పున జరిమానా, ఒక వ్యక్తికి రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

ప్రజాశక్తి - కోటనందూరు

ఆటో డ్రైవర్లు నిబంధన పాటించకపోతే చర్యలు తప్పవని సిఐ ఎం.గీతా రామకృష్ణ అన్నారు. శనివారం తుని పట్టణంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. స్కూళ్లు, కళాశాలలకు విద్యార్థులను తీసుకెళ్లే ఆటో డ్రైవర్లు యూనిఫారం లేకుండా నిర్లక్ష్యంగా ఆటో నడుపుతున్న డ్రైవర్‌కు ఫైన్ వేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నిబంధనలు పాటించకుండా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకెళ్లితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వానలు.. వ్యాధులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాను ఒక పక్క వానలు... మరోపక్క వ్యాధులు కుదిపేస్తున్నారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. దీంతో దోమలు విజృంభించటంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వాతావరణ మార్పుల నేపథ్యంలో వ్యాధులు పంజా విసురుతున్నాయి. వారం రోజులుగా ప్రభుత్వ ఆస్పత్రులు రోగులతో కిట కిటలాడుతున్నాయి. పల్లెల్లో వైద్య సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవటంతో రోగులు ప్రయివేటు వైదులను ఆశ్రయిస్తున్నారు. దీంతో రక రకాల పరీక్షల పేరుతో ప్రయివేటు ఆస్పత్రుల యాజామాన్యాలు సామాన్యుల జేబులకు చిల్లుపెడుతున్నాయి. వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం జ్వరాల నియంత్రణకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టినప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు కనిపించట్లేదు. ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నామని చెబుతున్నా.. చాలా గ్రామాల్లో వైద్య సిబ్బంది ఎవరూ రాలేదని చెబుతున్నారు. రాజమహేంద్రవరం రూరల్‌లోని ధవళేశ్వరంలోని వార్ఫ్, లాకులైను ప్రాంతాల్లో నేటికీ సర్వే జరుగలేదు. అక్కడ పారిశుధ్యం లోపించడంతో మలేరియా కేసులు వెలుగుచూశాయి. అయితే బాధితులు ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించడంతో వీటిని లెక్కలోకి తీసుకోవట్లేదు. గ్రామంలో పారిశుధ్యం పూర్తిగా క్షీణించింది. పదిరోజులు క్రితం ఎంఎల్ఎ, కలెక్టర్ పర్యటించారు. ఆ రెండు రోజులు హడావుడి తప్ప ప్రస్తుతం ఎక్కడా పనులు మాత్రం జరగట్లేదు. జిల్లా వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

దిగిరానంటున్న ధరలు

నిత్యావసర సరుకుల ధరలు కిందకు దిగనంటున్నాయి. బియ్యం ధరలకు రెక్కలొచ్చిన విషయం విధితమే. సన్నరకం కేజీ బియ్యం కొనుగోలు చేయాలంటే రూ.60 పై మాటే. ఉల్లిపాయలు ఇప్పటికే కొండెక్కాయి. పప్పులు, ఇతర అపరాల ధరలూ డబుల్ సెంచరీలకు దగ్గరలో ఉన్నాయి. అల్లం, వెల్లుల్లి ధరలు సామాన్యులకు అందనంత ఎత్తుకు పెరిగిపోయాయి. తాజాగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో కూరగాయల ధరలు మళ్లీ ఆకాశాన్నంటే పరిస్థితులు లేకపోలేదని వ్యాపారులు చెబుతున్నారు. మరో వైపు ప్రజా పంపిణీ ద్వారా ప్రభుత్వం కేవలం బియ్యం మాత్రమే ఇప్పటి వరకూ అందించింది. ఈ నెల పంచదార పంపిణీ చేస్తామని చెబుతోంది. అయితే దీని అమలు చూడాలి. గతంలో 11 రకాల నిత్యావసర సరుకులు అందజేసిన విషయం విధితమే. ప్రస్తుతం ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులు అందజేయటంతో పాటు ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్లోజర్ పనులు లేక ఆందోళన

పంట కాల్వల ఆధునికీకరణ పనులను ప్రభుత్వం అటకెక్కించటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వారిలో ఆందోళన మరింత పెరిగింది. గుర్రపు డెక్క తొలగింపు పనులకు నిధులు కేటాయించినా నతత్తనడకన పనులు సాగుతున్నాయి. జిల్లాలో 5.54 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ఏడాది జూన్1న సాగు నీరు విడుదల చేశారు. శివారు భూములకు నీరు రాకపోవడంతో జూన్ నెలాఖరు నాటికి రైతులు సాగు ప్రారంభించే అవకాశాలు సన్నగిల్లాయి. పంట కాలువల ఆధునికీకరణ, మీడియం, మైనర్, మేజర్ డ్రైన్లలో పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో భారీ వర్షాలు, వరదలు వస్తే అన్నదాతకు కష్టాలు తప్పేలా లేవు.



ముసురు ముంపు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ఫలితంగా జిల్లా వ్యాప్తంగా వారాంతంలో వర్షాలు జోరుగా కురిశాయి. దీంతో పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మరోవైపు ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో గోదావరి నదికి వరద నీరు క్రమ క్రమంగా చేరుతోంది. దీంతో పరివాహక ప్రాంత ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

కోరంగి అభయారణ్యంలో ట్రైనీ అధికారులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ అకాడమీ ద్వారా రాజమహేంద్రవరంలో శిక్షణ పొందుతున్న ఫారెస్ట్ సెక్షన్ అధికారులు శనివారం కోరంగి అభయారణ్యాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డివిజనల్ ఫారెస్ట్ అధికారి అనుష, ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్.వరప్రసాద్ మడ అడవుల ప్రాముఖ్యతను, హోప్ ఐలాండ్ యొక్క విశిష్టత, మడ జాతికి చెందిన వివిధ రకాల మొక్కలు, జంతువుల గురించి వివరించారు. సముద్ర తాబేల్లు సంరక్షణ, మడ అడవులలో నాటు సారా అరికట్టే విధానం వివరించారు. మడ జాతికి చెందిన మొక్కల పేర్లను తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ ఎవి.రమణమూర్తి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాటిఫికేషన్ అంశాలపై కౌన్సిల్ అభ్యంతరం

ప్రజాశక్తి - పిఠాపురం

పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ హాల్ నందు వైస్ ఛైర్‌పర్సన్ పి.జ్యోతి అధ్యక్షతన శనివారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో ర్యాటిఫికేషన్ అంశాలపై కౌన్సిల్ అభ్యంతర వ్యక్తం చేసింది. తొలుతగా మాజీ కౌన్సిలర్ సారా మీరయ్య మృతికి కౌన్సిలర్లు, అధికారులు సంతాపం వ్యక్తం చేశారు. సమస్యల ప్రస్తావన లేకుండా అధికారుల మధ్య కొట్లాటతో వాడి వేడిగా సమావేశం సాగింది. 105 అంశాలు చర్చకు రాగా ఆమోదం పొందకుండా ఉన్న పనులను ర్యాటిఫికేషన్ ద్వారా శంకుస్థాపనలు చేసి పనులు చేస్తున్నారని, అటువంటపుడు కౌన్సిలర్లు దేనికి అని పలువురు కౌన్సిలర్లు నిలదీశారు. ఏజెండాలో పేర్కొన్న ర్యాటిఫికేషన్ పనులన్నింటిని నిలిపి వేయడానికి ఆమోదం తెలిపారు.

గండేపల్లిలో అన్నదానం

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ముగింపు సందర్భంగా యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణుని ఆలయం వద్ద అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాన్ని జాతీయ రహదారి మీదుగా ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

2న మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - తాళ్లరేవు

డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజులు పురస్కరించుకుని సెప్టెంబర్ 2న పి.మల్లవరంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు జనసేన నాయకులు విఆర్ఎన్‌బి.ప్రసాద్ తెలిపారు. రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ నిర్వహణలో ఉదయం 8 గంగల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ జరిగే ఈ శిబిరంలో పవన్ కళ్యాణ్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

శృంగార వల్లభ స్వామిని దర్శించుకున్న ఎంఎల్‌సి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతిలో ఉన్న శృంగార వల్లభ స్వామిని ఎంఎల్‌సి పి.హరిప్రసాద్ శనివారం దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి వడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆయనకు ప్రసాదాలు, స్వామి ఫోటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి, సర్పంచ్ మొయిళ్ళ కృష్ణమూర్తి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రోడ్లన్నీ జలమయం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలో భారీగా కురుస్తున్న వర్షాలతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. జనజీవనం స్తంభించిపోయింది. వ్యాపార సముదాయాలు మూతబడ్డాయి. చేనేత మగ్గాల వద్ద చమాయింపు రావడంతో మగ్గాలకు బ్రేకులు పడ్డాయి.

మెకానికల్ విభాగంలో అతిథి ఉపన్యాసం

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య యూనివర్సిటీ మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో 3, 5 సెమిస్టర్ విద్యార్థులు కొరకు అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ఈ సదస్సులో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్ యూనివర్సిటీ మెకానికల్ ప్రొఫెసర్. పివి.మణివణ్ణన్ పాల్గొని 'ఎలక్ట్రిక్ అండ్ హైబ్రిడ్ వెహికల్స్ టెక్నాలజీ' అనే అంశంపై విశదీకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు సందేహాలకు ఉదాహరణలతో నివృత్తి చేశారు. యూనివర్సిటీ డిప్యూటీ ప్రో. ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తరచు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు నూతన టెక్నాలజీని అందివ్వడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎ.శరవణన్, డాక్టర్ బిహెచ్.వరప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

యానాం వార్తలు



ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ శ్రీనివాస్ అశోక్

లయన్స్ క్లబ్ సభ్యుల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - యానాం

స్థానిక గాజుల వారి వీధిలో ఉన్న పార్వతీశ్వరమ్మ మినీ ఫంక్షన్ హాల్‌లో లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ యానాం పిల్లారాయ నూతన కార్యవర్గ సభ్యులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పాల్గొని లయన్స్ క్లబ్ యానాం పిల్లారాయ చేసిన సేవలను కొనియాడారు. లయన్స్ క్లబ్‌కి త్వరలో శాశ్వతంగా ఉండటానికి భవనం నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా గవర్నర్ డాక్టర్ బాలకృష్ణ అధ్యక్షతన వేలూరు సూర్యనారాయణ (మాజీ డిస్టిక్ గవర్నర్) ఆధ్వర్యంలో క్లబ్ నూతన అధ్యక్షుడిగా డివివి.సత్యనారాయణ, సెక్రెటరీగా నల్లాం సురేష్, ట్రెజరీ కనకాల నరసింహమూర్తి, వైస్ ప్రెసిడెంట్స్‌గా బెజవాడ నిరంజన్, గొల్లపల్లి వీర్రాజు, ఛైర్‌పర్సన్ పులవర్తి వెంకట రమణమూర్తి, మెంబర్ షిప్ ఆఫ్ ఛైర్‌పర్సన్‌గా చింతపూడి సత్యనారాయణ, మార్కెటింగ్ ఛైర్‌పర్సన్‌గా ఆరిశెట్టి రాజేష్ ప్రమాణ స్వీకారం చేశారు.

నూతన కమిటీ ఏకగ్రీవం

ప్రజాశక్తి - యానాం

మద్రాస్ హైకోర్టు ఆదేశాల మేరకు పుదుచ్చేరి సహకారశాఖ ది యానాం కోఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ డైరెక్టర్ల ఎన్నిక ఈ నెల 21న నిర్వహించారు. ఈ నేపథ్యంలో కో-ఆపరేటివ్ నూతన కమిటీ ఎన్నిక శనివారం ఏకగ్రీవం అయింది. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ప్యానెల్ నుంచి ఎక్కువమంది డైరెక్టర్లు ఎన్నికవ్వడంతో శనివారం తన స్వగృహంలో సమావేశం నిర్వహించి కమిటీని ఏకగ్రీవం చేశారు. కో-ఆపరేటివ్ స్టోర్స్ ప్రెసిడెంట్‌గా లంక విద్యాసాగర్, వైస్ ప్రెసిడెంట్‌గా కమిడి విజయకుమార్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మల్లాడి కృష్ణారావు మాట్లాడారు. అనంతరం ఎన్నికైన వారిని మల్లాడి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ గిడ్ల చంద్రరావు, మున్సిపల్స్ మాజీ వైస్ ఛైర్మన్ పెండెం సూర్యప్రకాష్, ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లాడి సామ్యూల్ పాల్గొన్నారు.

ఎంఎల్ఎను కలిసిన దరియాలతిప్ప రైతులు

ప్రజాశక్తి - యానాం

స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను తన స్వగృహంలో దరియాలతిప్ప ఫీల్డ్ లేబర్ సొసైటీ రైతులు శనివారం కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయనకు వివరించారు. వరద తాకిడితో పంట పొలాలు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయని, అందుచేత పంట పొలాల చుట్టూ రక్షణ గోడ నిర్మించాలని, సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఓఎన్‌జిసి అధికారులతో మాట్లాడి రక్షణ గోడ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సబ్బతి శ్రీనివాసరావు, గిడ్ల వెంకన్న, దాసరి బుజ్జి, కోరుకొండ ఆనందరావు, రాంబాబు, సబ్బతి లోకేశ్వరావు పాల్గొన్నారు.

ముగిసిన ఎపిఎస్ఎస్‌డిసి ప్రోగ్రాం

ప్రజాశక్తి - గండేపల్లి

ఎపి రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ అనే అంశంపై సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో జరిగిన ఐదు రోజుల శిక్షణ శనివారంతో ముగిసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్‌లో పలు సూచనలు, సలహాలను ఉపాధ్యాయులు అందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతినిధి ఎస్.వరప్రసాద్, డీన్ అకడమిక్స్ డాక్టర్ పుల్లెల రవికుమార్, డీన్ ఆర్ అండ్ డి డాక్టర్ సిహెచ్‌వి.రాఘవేంద్ర, విభాగాధిపతి డాక్టర్ జిఎస్ఎన్.మూర్తి, వర్క్ షాప్ కో ఆర్డినేటర్ డివి.రవికుమార్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.97.40 వేల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో ఉన్న శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు రూ.97.40 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ దర్శనం టిక్కెట్లు ద్వారా రూ.29,910, అన్నదాన విరాళాల ద్వారా రూ.53,578, కేశఖండన ద్వారా రూ.5,840, తులాభారం ద్వారా రూ.250, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.7,875 ఆదాయం సమకూరిందన్నారు. యాత్రికులకు ఉదయం పులిహార, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించామన్నారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణార్యులు, సిబ్బంది సేవలందించారు.



అన్నదానం చేస్తున్న ఆలయ సిబ్బంది

డివిజన్లో 97.2 ఎంఎం వర్షపాతం నమోదు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం డివిజన్ పరిధిలో శనివారం ఉదయం 8:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 97.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయిందని ఆర్‌డిఒ జె.సీతారామారావు ఓ ప్రకటనలో తెలిపారు. పెద్దాపురంలో 12.8, గండేపల్లిలో 8.2, తొండంగిలో 6.4, ప్రత్తిపాడులో 7.4, కిర్లంపూడిలో 6.8, జగ్గంపేటలో 2.4, ఏలేశ్వరంలో 18.2, శంఖవరంలో 11.8, రౌతులపూడిలో 2.6, తునిలో 10.0, కోటనందూరులో 11.2 మిల్లీ మీటర్ల చొప్పున వర్షపాతం నమోదయిందని తెలిపారు.

ప్రమాదకరంగా రహదారులు


ప్రజాశక్తి - తాళ్లరేవు

అసలే వర్షాకాలం దానికి తోడు రహదారులు గోతులమయం కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మండలంలోని పలు ప్రాంతాల్లో రహదారులపై నిరంతరం పలు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అయినా ఆర్ అండ్ బి అధికారులు, స్థానిక పంచాయతీ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం మారిన రహదారుల తీరు మారలేదు. అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పి. మల్లవరం, పోలేకుర్రు పంచాయితీల సరిహద్దు ప్రాంతంలో రహదారి మధ్యలో పెద్ద పెద్ద గుంతలు పడి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరిహద్దు ప్రాంతం నుంచి పి. మల్లవరం పంచాయతీ మెయిన్ రోడ్డు వరకు రహదారి గుంతలు పడింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో ఈ గుంతలు పూడ్చాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

స్నానఘట్టం వద్ద గరుడ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి లో బాల బాలాజీ స్నానఘట్టం వద్ద దాత సహకారం తో నూతనంగా ఏర్పాటు చేసిన గరుడ విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో దాత మురమళ్ళ వాసులు చీకట్ల చిన్నయ్య, ఆదిలక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు, యాత్రికులు, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారని ఆలయ సహాయ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు.



బాల బాలాజీ స్నాన ఘట్టం వద్ద ఆవిష్కరించిన గరుడ విగ్రహం

అరటి తోటలు ధ్వంసం చేస్తున్న పందులు


ప్రజాశక్తి-అంబాజీపేట

మండలంలో రైతులు సాగు చేస్తున్న అరటి పంటలను పందులు ధ్వంసం చేస్తున్నాయి. మాచవరం, వాకలగరువు, తొండవరం, నందంపూడి తదితర గ్రామాలకు అరటి మార్కెట్ అందుబాటులో ఉండడంతో రైతులు అరటి పంట సాగు చేస్తున్నారు. రైతులు అధిక పెట్టుబడులు పెట్టి వేరే ప్రాంతాల నుంచి అరటి దుంపలు తెచ్చి సాగు చేపట్టారు. పిలకలు వేసే సమయంలో మొలకలు లేతగా ఉన్న సమయంలో పందులు వచ్చి పంటలు ధ్వంసం చేస్తున్నాయి. ఈ విషయమై రైతులు పలు సార్లు పంచాయతీ కార్యదర్శులకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పందుల పెంపకం దారులు, రైతులతో కలసి సమావేశమై పందులను బయటకు వదలకుండా జాగ్రత్తలు తీసు కుంటామని హామీ ఇచ్చారు. హామీ విస్మరించి రాత్రి సమయాల్లో పందులను వదిలివేస్తుండడంతో అరటి తోటలు ధ్వంసం చేస్తున్నాయి. పందుల పెంపకం దారులు ఫార్మ్ ఏర్పాటు చేసుకుని బయటకు వదలకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పందులు ధ్వంసంచేసిన అరటి తోట

సగం పంట నష్టపోయాను



మాచవరం డైలీ మార్కెట్ సమీపం పొలంలో ఎకరానికి రూ.50 వేలు పెట్టుబడి పెట్టి మూడు ఎకరాలు అరటి పంట సాగు చేశాం.. మొత్తం రూ.లక్ష 50 వేలు పెట్టుబడి పెట్టగా పందులు సుమారు 60 నుంచి 65 అరటి చెట్లు ధ్వంసం చేశాయి. సుమారు రూ.30 వేల వరకూ పంట నష్ట పోయాం. ఇలా కొనసాగితే ఈ ప్రాంత రైతులు అరటిపంట సాగుకు విరామం ప్రకటించ

-కొలిశెట్టి భాను ప్రసాద్, అరటి రైతు, మాచవరం

సంక్షిప్త వార్తలు

మున్సిపల్ డిఇఇ సస్పెన్షన్

ప్రజాశక్తి - పిఠాపురం

పురపాక సంఘం డిఇఇ ఎస్.భవానీ శంకర్‌ను సెస్పెండ్ చేస్తూ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.కనకారావు, డిఇఇ భవాని శంకర్‌లు ఒకరినొకరుపై ఆరోపణలు చేసుకుంటూ వ్యక్తిగతంగా దూషించుకున్నారు. ఈ సంఘటనపై మున్సిపల్ ఆర్‌డి నరసింహారావు, కాకినాడ ఆర్‌డిఒ ఇట్ల కిషోర్ విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. నివేదికను ఆధారంగా చేసుకుని డిఇఇని సెస్పెండ్ చేయాలని కలెక్టర్ సిపార్సు చేశారు. ఈ నేపథ్యంలో భవాని శంకర్‌ను సస్పెండ్ చేస్తూ పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ గోపాల కృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.